
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



వికారాబాద్ - మేడ్చల్

జిల్లాల వార్తలు

బుధవారం 28 మే 2025

సేవా దృక్పథంతో వైద్యం అందించాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



ఆసుపత్రిలోని పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్,మే 27(ఆంధ్రజ్యోతి): సేవా దృకథంతో రోగులకు వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రి నిర్వహణ సౌకర్యవంతంగా ఉండాలని, ప్రైవేటుకు దీటుగా వైద్య సేవలు అందించాలన్నారు. రోగులకు సౌకర్య వంతంగా ఉండేలా కౌంటర్లను ఏర్పాటు చేయాలని, ఆస్పత్రి ఆవరణలో మొక్కలు నాటాలని సూచించారు. పట్టణ కేంద్రంలోని ఏరియా ఆస్పత్రి ఆవరణలోని మార్చురీకి మరమ్మతులు చేయాలని పంచాయతీరాజ్ శాఖ ఈఈ ఉమేశ్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రిలోని పరిసరాలను, వివిధ విభాగాల గదులను పరిశీలించారు. కలెక్టర్ వెంట వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామచందర్‌రావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనంద్ తదితరులున్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్

లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ

» మేడ్చల్ కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ ప్రతినిధి, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లక్ష్యం మేరకు ధాన్యం సేకరణ సాఫీగా సాగుతున్నదని, వానాకాల పంటల సాగు కోసం జిల్లాలో రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచినట్లు మేడ్చల్ కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభం కావడంతో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. నకిలీ విత్తనాలు, భూ భారతిపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యాంప్రకాష్ పాల్గొన్నారు.



సాగుకు సన్నద్ధం

వానాకాలం సాగు ప్రణాళిక ఖరారు

తొలకరి పలకరించడంతో వానకాలం సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ 2025-26 సంవత్సరానికి సంబంధించి సాగు ప్రణాళికను సిద్ధం చేసింది. వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో రైతన్నలు తమ భూములను చదును చేయడంలో నిమగ్నం అయ్యారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి గతేడాది వికారాబాద్ జిల్లాలో 5,67,681 ఎకరాల్లో 239,926 మంది రైతులు వివిధ రకాల పంటలు సాగు చేయగా వచ్చే వానాకాలంలో వివిధ రకాల పంటల సాగు విస్తీర్ణం 5,73,650 ఎకరాలు ఉంటుందని అంచనా వేశారు. మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 24,900 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయని అంచనా వేశారు. అందుకు తగ్గట్లు రైతులకు అందుబాటులో ఉండేలా ఎరువులు, విత్తనాలను సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ సారికూడా పత్తి సాగువైపే రైతన్నలు మొగ్గు చూపుతున్నారు.

- పంట చేలను సిద్ధం చేస్తున్న రైతులు
- ఈ ఏడాదీ పత్తి సాగుకే మొగ్గు.. తర్వాత వరి
- వికారాబాద్ జిల్లాలో 5,73,650 ఎకరాలు..
- మేడ్చల్‌లో 24,900 ఎకరాల్లో సాగు అంచనా..
- విత్తనాలు, ఎరువులు సిద్ధం చేస్తున్న అధికారులు



ట్రాక్టర్‌తో నేలను దున్నుతున్న రైతు

మేడ్చల్ ప్రతినిధి/పరిగి/కొడంగల్ రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): గతేడాది వానాకాలంలో వికారాబాద్ జిల్లాలో పత్తి 2,61,099 ఎకరాల్లో సాగైతే.. ఈసారి 2,58.563 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. వరి గతేడాది 1,10,000 ఎకరాల్లో సాగు చేయగా, ఈ సారి 1,31,505 ఎకరాల్లో, కంది గతేడాది 1,04,448 ఎకరాల్లో సాగవగా ఈసారి 1,14,032 ఎకరాల్లో, మొక్కజొన్న గతేడాది 38,082 ఎకరాల్లో సాగు చేయగా, ఈ సారి 27,100 ఎకరాలకు తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. అదే జొన్న గతేడాది 1,116 ఎకరాల్లో పండించగా, ఈసారి 2,572 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. మినుములు గతేడాది 5,184 ఎకరాల్లో సాగు చేయగా, ఈసారి 5736 ఎకరాల్లో,

మిగతా 8వ పేజీలో...

విత్తనాల నిల్వలు

పంట రకం	విత్తనాలు (క్వింటాళ్లలో)
వరి	32876
జొన్నలు	205
మొక్కజొన్న	2168
సోయాబీన్	606
మినుములు	458
పెసర్లు	1187
కందులు	4561
పత్తి	5,17,126 (ప్యాకెట్లు)

రాయితీపై విత్తనాలివ్వాలి



వానాకాలం సాగుకు పొలాలను సిద్ధం చేస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో విత్తనాలు సిద్ధంగా లేవు. అన్ని రకాల విత్తనాలను ప్రభుత్వం రాయితీపై అందించాలి. రైతుబంధు డబ్బులు కూడా ఈ నెల చివర, లేదా జూన్ మొదటి వారంలో జమ చేస్తే పెట్టుబడులకు ఉపయోగపడుతుంది.

- టి.ప్రదీప్, రైతు, సుల్తాన్‌పూర్, పరిగి

రైతులు సాగుకు సిద్ధం కావాలి

వికారాబాద్ జిల్లాలో వివిధ రకాల పంటలు 5,73,650 ఎకరాల్లో సాగవుతాయని ప్రణాళికలు సిద్ధం చేశాం. అందుకు తగ్గట్టు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వర్షాలు కురిసిన చోట్ల రైతులు భూములను చదును చేసి సిద్ధం ఉంచుకోవాలి. భూసారం పెంచుకునేందుకు జీలుగ, జనుము విత్తనాలను రాయితీపై ఇస్తున్నాం.



- మోహన్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా వ్యవసాయాధికారి

మేడ్చల్‌లో 48 వేల మంది రైతులు

జిల్లాలో కురుస్తున్న వర్షాలతో రైతులు భూములను సిద్ధం చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో 'మన తెలంగాణ - మన వ్యవసాయం' కార్యక్రమం ద్వారా పంటలు, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఈ కార్యక్రమం నిర్వహించడం లేదు. జిల్లాలోని ఐదు మండలాల పరిధిలో 48 వేల మంది రైతులుండగా ఏడుగురు ఏవోలు, తొమ్మిది మంది ఏఈఓలు విధులు నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఒక ఏఈఓకు రెండు, మూడు గ్రామాలను అప్పగించారు.

హైవేపై ప్రమాదాలకు చెక్!

- రూ.70 కోట్ల పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి
- ఎన్టీపీసీ చౌరస్తాలో వీయూపీకి త్వరలో టెండర్
- ప్రమాదాలు, ట్రాఫిక్ సమస్యల నుంచి విముక్తి
- మరో మూడు వీయూపీలకు డిమాండ్

ఘట్‌కేసర్, మే 27 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు, ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఘట్‌కేసర్ మండలంలోని నారపల్లి సమీపంలోని సీపీఆర్ఐ నుంచి అవుషాపూర్ సమీపంలోని కేపాల్ వరకు 16 కిలోమీటర్ల హైవే వెళ్తుంది. జాతీయ రహదారి విస్తరణతోపాటు మండలంలోని యంనంపేట్ చౌరస్తా నుంచి ఎన్ఎఫ్‌సీ నగర్ రైల్వేగేట్ వరకు, అవుషాపూర్ ప్రారంభం నుంచి బీబీనగర్ మండలం సరిహద్దులోని కేపాల్ వరకు 2011లో బైపాస్ రోడ్డను నిర్మించారు. దీంతో బ్లాక్‌స్పాట్లు కొన్ని తగ్గినప్పటికీ నారపల్లిలోని దివ్యానగర్ చౌరస్తా, కొర్రెముల చౌరస్తా, జోడిమెట్ల చౌరస్తా, అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా, అంకుషాపూర్ చౌరస్తాలు బ్లాక్‌స్పాట్‌లుగా మారాయి. ఆయా చోట్ల ప్రమాదాల నివారణకు ప్రభుత్వం బ్రిడ్జీలు అండర్‌పాస్‌లు

మిగతా 8వ పేజీలో...

ఘట్‌కేసర్‌లో ఒక బ్రిడ్జి, మూడు అండర్‌పాస్‌లు



నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఘట్‌కేసర్‌లోని బైపాస్ చౌరస్తా

గతంలోనే సూచించాం



అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద హైవే దాటేందుకు వీయూపీ నిర్మించాలని 2011లోనే సూచించాం. రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశముందని చెప్పినా అధికారులు పట్టించుకోలేదు. ప్రమాదాలు జరుగుతున్నాయని రోడ్డును మూసివేశారు. అనేకమంది ప్రాణాలు కోల్పోయాక కళ్లుతెరిచారు.

- సింగిరెడ్డి నర్సింహారెడ్డి, అన్నోజిగూడ



హన్మంతు (ఫైల్)

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

యాలాల, మే 27(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి చెందినట్లు వికారాబాద్ జిల్లా యాలాల మండల పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. తోటి కూలీలు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ఓ రైతు పొలంలో జరుగుతున్న ల్యాండ్ లెవలింగ్ పనులకు హన్మంతు వెళ్లాడు. అక్కడ పనులు పూర్తికాగానే ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో ఛాతీలో నొప్పి వస్తుందని కిందపడిపోయాడు. కొద్దిసేపటికే అక్కడికక్కడే మృతి చెందాడు. హన్మంతుకు భార్య అంజిలమ్మ, కూతురు ఉన్నారు.



జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీవో నాగరాజు

సుస్థిర అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకం

» డీసీవో నాగరాజు

మోమిన్‌పేట్, మే 27(ఆంధ్రజ్యోతి): సుస్థిర అభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకమని డీసీవో నాగరాజు అన్నారు. మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిందన్నారు. సహకార వ్యవస్థపై పాఠశాల స్థాయి నుంచి అవగాహన కల్పించేందుకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలన్నారు. జూన్‌లో పెద్దఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. అనంతరం మోమిన్‌పేట్‌లో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో స్పెషల్ కల్చర్ డిప్యూటీ రిజిస్ట్రార్ నాగార్జున్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామకృష్ణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ కిరణ్మయి, అజ్మతుల్లా, జూనియర్ ఇన్‌స్పెక్టర్ మహమూద్ అలీ, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సహకార బ్యాంకు మేనేజర్ నారాయణరెడ్డి, కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న

అక్షరాస్యతను పెంచడమే లక్ష్యం

» జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు

మేడ్చల్ ప్రతినిధి, మే 27(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 47,867 మంది చదువు రానివారిని అక్షరాస్యులుగా చేయడమే లక్ష్యమని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు అన్నారు. జిల్లా వైద్యాధికారి విజయకుమారితో కలిసి న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాం(ఎన్ఐఎల్‌పి), ఉల్లాస్(సమాజంలో అందరికీ జీవితాంతం నేర్చుకోవడంపై అవగాహన), టాస్(ఓపెన్ స్కూల్)పై మండల విద్యాధికారులతో నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 15 నుంచి 45 ఏళ్లలోపు నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులుగా మార్చడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమన్నారు. నిర్ణీత 200 గంటల బోధనానంతరం పరీక్ష నిర్వహించి ధ్రువీకరణ పత్రం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమం పూర్తిగా వలంటీర్ల ఆధ్వర్యంలో జరుగుతుందని తెలిపారు. దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించి వారికి ఆహారంతో పాటు చదువు నేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య డీడీ నాగలక్ష్మి, ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్లు కృష్ణ, సురేందర్, జిల్లా ఇన్‌చార్జి అనిత, ఏపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొలానికి బలం.. రైతుకు లాభం

పచ్చి రొట్టతో సాగుకు మేలు 7

సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు

అటవీ భూమిలో సాగు చేస్తే చర్యలు

వన్యప్రాణులను కాపాడుకోవాలి

డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్ 7



ఎన్కతల శనైశ్వరస్వామి ఆలయంలో పూజల్లో భక్తులు

శనైశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

మోమిన్‌పేట్, మే 27 (ఆంధ్రజ్యోతి): మోమిన్‌పేట్ మండలంలోని ఎన్కతల గ్రామంలో వెలిసిన శ్రీ శనైశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శని జయంతి, అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు, తైలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అన్నదానం చేసిన విఘ్నేశ్వర్‌గౌడ్ దంపతులను ఆలయ కమిటీ మాజీ చైర్మన్, సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో కార్య నిర్వాహణ అధికారి నరేందర్, పూజారి రామ్, దిలీప్, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, శ్రీరాములు, వెంకటేశం, సంగమేశ్వర్‌రెడ్డి, వంశీగౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, పాపిరెడ్డి, సంగారెడ్డి, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్కారు బడి రమ్మంటోంది

జూన్ 6నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమం

- సౌకర్యాలు, వసతులపై ప్రచారం
- డ్రాప్ ఔట్ల నివారణకు చర్యలు

తాండూరు, మే 27(ఆంధ్రజ్యోతి): బడి బయట ఉన్న పిల్లలను గుర్తించడం, డ్రాప్ ఔట్‌లను నివారించడానికి ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ప్రజలను భాగస్వాములు చేస్తూ కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు ఉన్నాయని రెండు వారాలపాటు ప్రచారం నిర్వహించనున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించేలా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించనున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి గ్రామ, వార్డు స్థాయిలో సన్నాహక సమావేశాలు నిర్వహించి ప్రజలను భాగస్వాములను చేస్తారు. 'మన ఊరు పిల్లలందరిని మన బడుల్లోనే చేర్పుదాం - వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేద్దాం' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో నిర్వహించనున్నారు. జూన్ 6 నుంచి 19వ తేదీ వరకు 12 రోజులపాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. జూన్ 12న విద్యా సంవత్సరం పునఃప్రారంభం రోజున పండగ వాతావరణం కనిపించేలా కార్యక్రమాలు చేపట్టాలని ఉన్నతాధికారులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులను ప్రభుత్వం ఆదేశించింది.



జినుగుర్తిలో బడి బాట సన్నాహక ర్యాలీ

కార్యక్రమాల వివరాలు

బడిబాటలో భాగంగా జూన్ 6న గ్రామ సభ, 7న బడీడు పిల్లలను గుర్తిస్తారు. 8, 9, 10 తేదీల్లో కరపత్రాలతో ప్రచారం, డ్రాప్ ఔట్‌లను గుర్తించడం, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పిస్తారు. 11న సమీక్ష, 12న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు చేపట్టిన పనులను ప్రారంభిస్తారు. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేస్తారు. 13న సామూహిక అక్షరాభ్యాసం, బాలసభ ఉంటుంది. 16న ఎఫ్ఎల్ఎన్, లిప్ డే, పోస్టర్ల ప్రదర్శన, విద్యార్థులకు క్విజ్ పోటీలుంటాయి. 17న సమీకృత విద్య, బాలికా విద్య దినోత్సవం, ప్రతిజ్ఞ, 18న గదుల డిజిటలీకరణ, ఆధునిక సౌకర్యాలు చూపించడం, మొక్కలు నాటుతారు. జూన్ 19న బడిబాట ముగింపు కార్యక్రమంతోపాటు క్రీడా పోటీలు నిర్వహిస్తారు.

మిర్చి పంటను పరిశీలించిన అధికారులు



చేవెళ్ల, మే 27(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా నుంచి మిర్చి నారు తీసుకొచ్చి సాగు చేసి నష్ట పోయిన పంటను వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం చన్వల్లి గ్రామంలో పరిశీలించారు. గ్రామంలో 40 మంది రైతులు 70 ఎకరాల్లో సాగు చేసిన మిర్చి పంటను ఉద్యాన వన శాఖ అధికారి కీర్తి, మండల వ్యవసాయాధికారి శంకర్‌లాల్ తదితరులు రైతులతో కలిసి మిర్చి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు చెప్పారు. కాగా, కాత, పూత లేకపోవడంతో రైతులు చాలా వరకు నష్టపోయారని గుర్తించినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మొయినాబాద్ రూరల్, మే27(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల హక్కులు, ఆత్మగౌరవం కోసం కృషిచేస్తానని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్(టీడబ్ల్యూజేఎఫ్) చేవెళ్ల నియోజకవర్గ నూతన అధ్యక్షుడు చేగురి రాజు అన్నారు. మంగళవారం బాకారం జాగీర్ పరిధిలోని ఓ రిసార్ట్‌లో టీడబ్ల్యూజేఎఫ్ కార్యవర్గాన్ని కౌన్సిల్ సభ్యులు, జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా మొయినాబాద్ మండలం అప్పారెడ్డిగూడకు చెందిన విలేకరి రాజును ఎన్నుకున్నారు. కార్యదర్శిగా జయచంద్ర(శంకర్‌పల్లి), ఉపాధ్యక్షుడిగా మహేశ్‌ను ఎన్నుకున్నారు. తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన సంఘం సభ్యులకు రాజు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాస్‌చారి, గణేష్, సైదులు, రమేష్, బుచ్చన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంఘం సభ్యులు

జాబ్‌మేళాను విజయవంతం చేయాలి

● కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు/వికారాబాద్,మే 27(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈనెల29న తాండూరులో నిర్వహించే జాబ్‌మేళాను విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం ఈనెల 29న(గురువారం) తాండూరులో నిర్వహించే జాబ్‌మేళాపై తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి జిల్లా అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఉపాధి కల్పన, మార్కెటింగ్ మిషన్(ఇజీఎంఎం) ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 52 పారిశ్రామికరంగాల్లో 11వేల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. జాబ్‌మేళాకు వచ్చే నిరుద్యోగులకు మౌలిక వసతులు కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పం మేరకు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో తాండూరులోని వినాయక కన్వెన్షన్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాలో అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా స్టాళ్లను ఏర్పాటుచేసి తన వంతు సహాయసహకారాలు అందిస్తానని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ఈజీఎంఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణన్, జేడీఎం సతీష్, తాండూరు సీడీపీవో శ్రీలత, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, పక్కన తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

యువతీ యువకులు తరలిరావాలి

తాండూరు రూరల్: తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళా కార్యక్రమాన్ని మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులు తరలిరావలని తాండూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జర్నె నాగప్ప మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్‌పాస్, ఫెయిల్, ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ అర్హతలు కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడాలి

యాచారం, మే 27(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తున్నందున తాగు నీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేయించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజ అన్నారు. మంగళవారం మండల పరిషత్‌లో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడారు. తాగునీరు కలుషితమైతే అతిసార, విష జ్వరాలు ప్రబలుతాయన్నారు. హరితహారం కింద మొక్కలు నాటేందుకు జాగాలు గుర్తించి గుంతలు తవ్వించాలన్నారు. మురుగు నీరు రోడ్లపై పారకుండా చూసుకోవాలన్నారు. ఫామ్‌పాండ్ల నిర్మాణం తప్ప ఇతర పనులను ఉపాధి కూలీలతో చేయించొద్దన్నారు. ఫామ్‌పాండ్ల నిర్మాణంలో తాము జిల్లాలో టాప్‌లో ఉన్నట్లు చెప్పారు. సమావేశంలో ప్రత్యేకాధికారి మాధవరావు, ఎంపీవో శైలజ, ఏపీవో లింగయ్య, ఇంజినీరింగ్ కన్సల్టెంట్ శివశంకర్‌రెడ్డి ఉన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎంపీడీవో శైలజ

ఇంటి స్థలం విషయంలో గొడవ

బషీరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం విషయం ఇరు కుంటుంబాల మధ్య గొడవకు దారితీసింది. ఈ ఘటన బషీరాబాద్ మండలం గంగ్వార్‌లో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన చంద్రకళ, ప్రమీలమ్మ కుటుంబం, ఊరడి నర్సమ్మ కుటుంబీకులతో ఇంటి స్థలం విషయంలో కొద్ది రోజులుగా గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల చంద్రకళ కుటుంబం ఇంటిని నిర్మించేందుకు ప్రయత్నించగా, పక్కనే ఇళ్లు కట్టుకుని నివాసం ఉంటున్న ఉరడి నర్సమ్మ కుటుంబీకులు దారి స్థలం విడిచిపెట్టాలని కోరారు. ఈ స్థలం తమదంటూ చంద్రకళ కుటుంబీకులు తేల్చిచెప్పడంతో ఇరుకుటుంబాల మధ్య గొడవలు మొదలైంది. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు పంచాయతీ కార్యదర్శి శృతికి ఫిర్యాదులు చేసుకున్నారు. మంగళవారం ఇరు కుటుంబాల మధ్య స్థలం విషయంలో ఘర్షణ వాతావరణం నెలకొనడంతో ఎస్‌ఐ శంకర్, కార్యదర్శి అక్కడికి చేరుకుని ఇంటి నిర్మాణానికి ఇచ్చిన అనుమతి ప్రకారం ఇళ్లు కట్టుకోవాలని చంద్రకళ కుటుంబానికి సూచించారు. మరోమారు ఇరు కుటుంబాల మధ్య గొడవ పెద్దది కావడంతో ఎస్‌ఐ వారిని సముదాయించారు. అనంతరం కార్యదర్శి చంద్రకళ ఇంటిని నిర్మించుకునేందుకు కొలతలు చూపించడంతో ఇరు కుటుంబాలు,పెద్దలు శాంతించారు.



కొత్తూర్: ఎస్‌బీపల్లిలో పత్తి విత్తనాలు విత్తుతున్న కూలీలు



యాచారం: మేడిపల్లిలో జొన్న విత్తనాలు వేస్తున్న రైతు

ఊపందుకున్న సాగు పనులు

కొత్తూర్/యాచారం, మే 27(ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో రైతులు విత్తనాలు నాటే పనిలో పడ్డారు. ఇప్పటికే వేసవి దక్కులు చేసుకున్న వారు ప్రస్తుత వానలకు విత్తనాలు విత్తుతున్నారు. కొత్తూర్ మండలం కొడిచర్ల, ఎస్‌బీపల్లి, రెడ్డిపాలెం, గుడూర్ ప్రాంతాల్లో పత్తి విత్తనాలను నాటుతున్నారు. యాచారం మండలంలోని మేడిపల్లి, తాటిపర్తి గ్రామాల్లో జొన్నలు వేశారు. పశువుల ఎరువు పొలంలో చల్లి రెండుమార్లు దున్ని విత్తనాలు విత్తుతున్నారు. రోహిణి కార్తెలో మొక్కజొన్న విత్తుకుంటే దిగుబడి బాగా వస్తుందని రైతులు అన్నారు.

పాలబిల్లు చెల్లించేవరకు ట్యాంకర్‌ను వెళ్లనివ్వం

శీతలీకరణ కేంద్రానికి తాళం వేసి రైతుల నిరసన

మోత్కూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): తమకు పాల బిల్లు చెల్లించేంతవరకు ట్యాంకర్‌ను శీతలీకరణ కేంద్రంలోని వెళ్లనివ్వబోమని రాగిబావి గ్రామపాడి రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం యాదాద్రి జిల్లా మోత్కూరులో ఈ సంఘటన జరిగింది. మోత్కూరులోని పాల శీతలీకరణ కేంద్రం పరిధిలో సుమారు 45 పాల సొసైటీలు (మదర్ డెయిరీకి సంబంధించిన పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు) ఉన్నాయి. పాడి రైతులకు మదర్ డెయిరీ ప్రతీ 15 రోజులకు ఒకసారి పాలబిల్లు చెల్లించాల్సి ఉంది. మార్చి నుంచి సుమారు మూడు నెలలుగా (ఐదుబిల్లులు) పాడి రైతులకు బిల్లు చెల్లించడం లేదు. ప్రతి 15 రోజులకు సుమారు రూ.20లక్షల చొప్పున ఇప్పటి వరకు ఐదు బిల్లులు కలిపి 45సొసైటీల రైతులకు సుమారు కోటి రూపాయలు చెల్లించాల్సి ఉంది. రైతులు ఎన్నిసార్లు అడిగినా ఇది ఇక్కడి సమస్య మాత్రమే కాదని, నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల స్థాయి మదర్ డెయిరీ వ్యాప్తంగా ఉన్న సమస్య తాము ఏమీ చేయలేమని అధికారులు దాటవేస్తూ వచ్చారు. రాగిబావి గ్రామ పాడి రైతులకు ఐదు బిల్లులు సుమారు రూ.4లక్షలు చెల్లించాల్సి ఉంది. దీంతో సుమారు 20మంది పాడి రైతులు మంగళవారం మోత్కూరు పాల శీతలీకరణకేంద్రం గేటుకు తాళం వేసి ధర్నాకు దిగారు. ఈ క్రమంలో ఆ కేంద్రం నుంచి పాలు తీసుకెళ్లడానికి పాలట్యాంకర్ వచ్చింది. శీతలీకరణ కేంద్రం సిబ్బంది నచ్చజెప్పినా వినకుండా తమ గ్రామంలో పండుగ ఉందని, పండుగ ఖర్చులకు కూడా తమ వద్ద డబ్బులేదని, తమకు బిల్లులు చెల్లించేవరకు ధర్నా విరమించేదిలేదంటూ ట్యాంకర్‌ను లోనికి వెళ్లనివ్వలేదు. దీంతో పాల శీతలీకరణ కేంద్రం మేనేజరుపరమేష్ సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి ఒకనెల బిల్లు(రెండు బిల్లులు) రూ.150 లక్షలకు చెక్కు రాసి ఇవ్వడంతో పాడి రైతులు ధర్నా విరమించి తాళం తీశారు.



ధర్నా చేస్తున్న పాడి రైతులు



కంకర వేశారు.. బీటీ మరిచారు

దుద్యాల, మే 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాల్యానాయక్ తండాకు దాదాపు రెండు కిలోమీటర్ల మేర బీటీరోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. అందులో భాగంగా రోడ్డును తవ్వి కంకర వేశారు. ఐదు నెలలు గడుస్తున్నా బీటీ వేయకపోవడంతో వాహనదారులు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కంకర రోడ్డుపై ప్రయాణం సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నామని తండావాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీటీరోడ్డు పనులను పూర్తి చేయాలని కోరారు.



అమ్మవారి దర్శనానికి వేచిఉన్న భక్తులు

కొత్లాపూర్ ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

● ఈ నెల 30న రథోత్సవం, సిడే కార్యక్రమాలు

తాండూరు రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ-కర్ణాటక సరిహద్దులోని తాండూరు మండలం కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. మూడో మంగళవారం సందర్భంగా భక్తులు తెల్లవారు జామునుంచే ఆలయానికి చేరుకుని బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఈవో శేఖర్‌గౌడ్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా జాతరోత్సవాల్లో భాగంగా ఈనెల30న ప్రధాన ఘట్టాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఈవోలు తెలిపారు. ఆలయ నిర్మాణ దాత, అరవింద లింబావళి దంపతులు, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దంపతులు రథోత్సవానికి హాజరై ప్రత్యేకపూజలు నిర్వహించనున్నారు.

పొలాలకు దారి కోసం వినతి

బషీరాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): పంట పొలాలకు వెళ్లేదారి కోసం బషీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్ రుక్సానా బేగంను కలిసి కాశీంపూర్ గ్రామ రైతులు వినతి పత్రం అందజేశారు. ఈ విషయమై కలెక్టర్, సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని, వారి ఆదేశానుసారం సర్వేచేయించి దారి చూపించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. డీటీని కలిసిన వారిలో మాజీ సర్పంచ్ అంజిలయ్య, ఏఎంసీ మాజీ డైరెక్టర్ బాబుషరీఫ్, రవి, శివ్యానాయక్, దస్తాప్ప, రామప్ప పాల్గొన్నారు.

అటవీ భూమిలో సాగు చేస్తే చర్యలు


సదస్సులో మాట్లాడుతున్న డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్

యాలాల, మే 27, (ఆంధ్రజ్యోతి): అటవీ భూముల్లో అక్రమంగా సాగు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్ హెచ్చరించారు. మంగళవారం యాలాల మండల పరిధిలోని సంగాయిపల్లితండాలో అడవుల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులను, వన్యప్రాణులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అటవీ ప్రాంతలోకి ఎవరైనా అక్రమంగా ప్రవేశించినా, చెట్ల నరికివేతకు పాల్పడినా ఉపగ్రహ ఛాయా చిత్రాల ఆధారంగా గుర్తించి కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రాక్టర్, జేసీబీ యజమానులు రాత్రివేళల్లో అటవీ ప్రాంతంలోకి వెళ్లకూడదని, అలా వెళ్లి అడవిని ధ్వంసం చేస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అనంతరం ప్రజల చేత అడవిని రక్షించుకుందామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.రాజేందర్, ధారూర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు కనకరాజు, శంకర్, ఇన్‌చార్జి తహసీల్దార్ కిరణ్‌కుమార్, యాలాల ఎస్‌ఐ గిరి, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘట్‌కేసర్‌లో భారీ వర్షం


ఘట్‌కేసర్ మున్సిపాలిటీ చందుపట్లగూడలో కురుస్తున్న వర్షం

ఘట్‌కేసర్, మే 27 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షంతో తొలకరి స్వాగతం పలికింది. ఘట్‌కేసర్ మండల వ్యాప్తంగా మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి కొంత ఎండ, అప్పుడప్పుడు మబ్బులు కమ్ముకొని తీవ్రమైన ఉక్కపోత వెరసి సాయంత్రానికి భారీ వర్షం కురిసింది. ఒక్కసారిగా వచ్చిన భారీ వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. గంటకు పైగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల రహదారులపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.


మాట్లాడుతున్న డీఆర్డీఏ డీపీఎం నర్సింహ

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

యాచారం, మే 27(ఆంధ్రజ్యోతి): మహిళలు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రంగారెడ్డి డీఆర్డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ నర్సింహ తెలిపారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాల డ్వాక్రా పొదుపు సంఘాల సభ్యులకు చిన్న, మధ్యతరగతి పరిశ్రమల స్థాపనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, అసోసియేషన్ ఆఫ్ లేడీ ఎంటర్‌ప్రెన్యూర్స్ ఆఫ్ ఇండియా అనే స్వచ్ఛంద సంస్థ మహిళలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇవ్వడానికి ముందుకు వచ్చిందని తెలిపారు. కిరాణ షాపులు, మేకలు, గొర్రెల పెంపకంతో పాటు ఇతరత్రా పరిశ్రమలు ఏర్పాటు చేసి స్వయం ఉపాధి పొందడంతో పాటు సాటి మహిళలకు ఉపాధి కల్పించడానికి మహిళలు ముందుకు రావాలన్నారు. మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం నిర్వహించడంతో పాటు వ్యాపార ఉత్పత్తులు మార్కెటింగ్‌పై శిక్షణ ఇవ్వడానికి స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ర్యాంప్ పథకంలో భాగంగా సేవా స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో యాచారం మండలంలోని పలు గ్రామాల్లో మహిళలకు తరచూ శిక్షణ ఇవ్వడంతో పాటు చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వం నుంచి నిధులు ఇప్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. మహిళలకు ఆహార ఉత్పత్తులు తయారు చేయడంపై శిక్షణ ఇచ్చి ఆదుకుంటామని సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ చెప్పారు. ఏపీఎం సాంబశివుడు, కోఆర్డినేటర్ కిరణ్, సీసీలు గణేష్ తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ తరగతుల్లో డీఈవో, హిందీ పండిట్‌లు

డ్రగ్స్ అనర్థాలను విద్యార్థులకు వివరించాలి

» ఉపాధ్యాయులకు డీఈవో సూచన

శంషాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు డ్రగ్స్ బారిన పడకుండా, డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై ఉపాధ్యాయులు సూచనలు చేయాలని జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావు అన్నారు. శంషాబాద్‌లోని ఏడీపై పాఠశాలలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల హిందీ పండిత్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారి బారినపడకుండా చూడాల్సిన అంశాలపై తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ శిబిరాన్ని మంగళవారం డీఈవో పరిశీలించారు. టీచర్లతో ఆయన మాట్లాడుతూ.. డ్రగ్స్ వాడకంతో జరిగే అనర్థాలపై విద్యార్థులకు శిక్షణ పొందిన ఉపాధ్యాయులు కూలంకుశంగా తెలియజేయాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజం అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. డ్రగ్స్ నివారణలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు హిందీ పండిత్‌లకు ఐదు రోజుల శిక్షణ ఇస్తున్నామని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణ్ నాయక్, కోర్సు డైరెక్టర్ నరేందర్, రీసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకం

» చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్


సీఐకి నగదు అందిస్తున్న మాజీ సర్పంచ్ గోపాల్‌రెడ్డి

చేవెళ్ల, మే 27(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని, గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలని చేవెళ్ల సీఐ భూపాల్ శ్రీధర్ తెలిపారు. మంగళవారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని పామెన వార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి రూ.1.5 లక్షలు సీఐకి అందజేశారు. నేర పరిశోధనలో పోలీసులకు సహకరించాలని సీఐ సూచించారు. నాయకులు ఎర్ర గోపాల్, గ్రామస్థులు ఉన్నారు.

పొలానికి బలం.. రైతుకు లాభం



» పచ్చి రొట్టతో సాగుకు మేలు

దుద్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగు నేపథ్యంలో రైతులు పొలాల్లో దుక్కులు దున్నడంలో నిమగ్నమయ్యారు. భూసారాన్ని పెంచేందుకు గతంలో రైతులు పశువుల ఎరువులను వేసి కలియదున్నేవారు. ప్రస్తుతం పశుపోషణ తగ్గడంతో సేంద్రియ ఎరువుల స్థానంలో రసాయన ఎరువుల వాడకం ఎక్కువ అవుతోంది. దీంతో భూములు వాటి సహజ లక్షణాలు కోల్పోతున్నాయి. జీలుగ, పచ్చిరొట్ట విత్తనాలు చల్లితే పొలానికి బలం చేకూరుతుందని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. సేంద్రియ ఎరువులతోనే పంట దిగుబడిని రెట్టింపు చేసుకోవచ్చని చెబుతున్నారు. పచ్చిరొట్ట, జీలుగ విత్తనాలను తప్పనిసరిగా పొలాల్లో వేసుకుంటే రసాయన ఎరువులతో అంతగా అవసరం ఉండదంటున్నారు.

ప్రయోజనాలెన్నో

పొలంలో జీలుగ చల్లిన తర్వాత ఏపుగా పెరిగి పూత దశలో ఉన్నప్పుడు కలియదున్నిన తర్వాత అవి పొలానికి విశేషమైన లాభాలను చేకూరుస్తుంది. విత్తనాలు చల్లుకోవడం ద్వారా నేల కోతకు గురి కాదు. మొక్కకు నత్రజని, సూపర్‌ఫాస్పేట్‌ను అదనంగా అందిస్తాయి. పైరు పొలంలో కలుపు మొక్కల పెరుగుదలను పూర్తిగా కంట్రోల్ చేస్తుంది. మాంగనీస్, జింక్, కాల్షియం, ఇనుము లాంటి సూక్ష్మధాతువులను పంటలకు చేకూరుస్తాయి. నేలలో కరగని మూలకాలను పంటకు అనుకూలంగా మార్చుతాయి. వానపాముల ఉత్పత్తికి దోహదం చేస్తాయి. మొక్కల వేర్లు బాగా పెరిగి పోషకాలు బాగా గ్రహిస్తాయి.

సాగు విధానం

ఎకరానికి 10 నుంచి 12 కిలోల జీలుగ విత్తనాలను దుక్కిలో చల్లుకోవాలి లేదా సాళ్లలో విత్తుకోవాలి. మొక్కలు బాగా పెరిగేందుకు సరైన సమయంలో తడి పెట్టాలి. 25 నుంచి 30 రోజులకు మొక్కలు ఏపుగా పెరిగి, పూత దశకు చేరుకుంటాయి. ఆ సమయంలో రోటోవేటర్ సాయంతో కలియదున్నాలి. అనంతరం సూపర్ ఫాస్పేట్‌ను దుక్కిలో వేయాలి. దీంతో మొక్కల అవశేషాలు బాగా కుళ్లిపోతాయి. కుళ్లే దశలో నీటిని బాగా అందించాలి. కుళ్లి పచ్చిరొట్ట ఎరువులు తయారు అవుతాయి.

సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు



పీఏసీఎస్, ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో సబ్సిడీపై జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయి. జీలుగ క్వింటాలు రూ.14250 కాగా 50శాతం సబ్సిడీ పోనూ అమ్మకపు ధర రూ.7125,30 కేజీల బస్తాకు సబ్సిడీ పోనూ రూ.2137,30 కిలోల బస్తా 2 ఎకరాల 5 గుంటల భూమిలో వాడుకోవచ్చు. జనుము క్వింటాలు రూ.12550 కాగా 50 శాతం సబ్సిడీ పోను రూ.6275, 40 కేజీల బస్తాకు సబ్సిడి పోనూ రూ.2150కి అందించడం జరుగుతుంది. ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లతో విత్తనాలను తీసుకోవాలి.

శంకర్‌రాథోడ్, ఏడీఏ, కొడంగల్


ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ఆలయ పునర్‌నిర్మాణానికి రండి

తాండూరు, మే 27(ఆంధ్రజ్యోతి): తాండూరు పట్టణం ఇందిరానగర్‌లో ఈ నెల 30న రామ మందిర పునర్ నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని కోరుతూ ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి, ముజీబ్‌ఖాన్‌ను ఆహ్వానించారు. తాండూరులో ఉన్న ఏకైక రామ మందిరాన్ని దాతల సహకారంతో పునర్‌నిర్మాణం చేపడుతున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు

వికారాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంటర్మీడియట్ జనరల్ విభాగం పరీక్షల చివరి రోజు ఇద్దరు విద్యార్థులపై మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదయ్యాయి. మంగళవారం జరిగిన కామర్స్, కెమిస్ట్రీ పరీక్షలకు 3,448 మంది విద్యార్థులకు 265 మంది గైర్హాజరయ్యారు. ఫస్టియర్ పరీక్షలకు 2,554 మంది హాజరు కావాల్సిన 2,349 మంది హాజరుకాగా, 205 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 2,515 మందికి 2,315 మంది హాజరుకాగా, 200 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షలకు 39 మందికి 34 మంది హాజరు కాగా, ఐదుగురు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన సెకెండియర్ పరీక్షలకు 894 మందికి 834 మంది హాజరు కాగా 60 మంది గైర్హాజరయ్యారు. జనరల్ విభాగంలో 866 మందికి 806 మంది హాజరుకాగా, 60 మంది హాజరు కాలేదు. ఒకేషనల్ పరీక్షలకు 28 మందికి 28 మందికి హాజరయ్యారు.

పరిగికి ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు

» రూ.200 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు


విద్యారణ్యపురిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి(ఫైల్)

పరిగి, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పరిగికి ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను మంజూరు చేసింది. ఇందుకు సంబంధించి ఇంటిగ్రేటెడ్ భవన నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ స్కూల్ ఏర్పాటు గురించి ఈ నెల 14న పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి, టీజీఈడబ్ల్యూఐడీసీ ఎండీ గణపతిరెడ్డి, అధికారులు పరిగి మున్సిపల్ పరిధిలోని విద్యారణ్యపురిలో స్థలాన్ని పరిశీలించిన విషయం విధితమే. స్థలంతోపాటు వనరుల గురించి ఎమ్మెల్యే సూచన మేరకు అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఈ మేరకు ప్రభుత్వం పరిగిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి రూ.200 కోట్లు మంజూరి చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పరిగిలో 20 ఎకరాల స్థలాన్ని ఇప్పటికే గుర్తించారు. ఈ స్థలంలో భవనం, ఇతర వసతులతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మించనున్నారు. విద్యారణ్యపురిలో ఇప్పటికే పలు విద్యా సంస్థలు కొనసాగుతున్నాయి. ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుతో విద్యారణ్యపురి ఎడ్యుకేషన్ హబ్‌గా మారనుంది.

కలివి వనం పోస్టర్ ఆవిష్కరణ


కలివి వనం చిత్రం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేటీఆర్

చేవెళ్ల, మే 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ గ్రామీణ బ్యాంక్ డ్రాప్‌లో చేవెళ్ల ప్రాంతానికి చెందిన మల్లిఖార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలు ఏఆర్ ప్రొడక్షన్ బ్యానర్‌పై రాజ్ నరేంద్ర రచన, దర్శకత్వంలో నిర్మించిన కలివి వనం చిత్రం పోస్టర్‌ను బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నగరంలోని ఆయన నివాసంలో ఆవిష్కరించారు. కలివి వనం చిత్రం వనాలను రక్షించుకునే నేపథ్యంలో తెలంగాణలోని జగిత్యాల జిల్లాలోని గుర్రాజపల్లి, సారంగపూర్ అటవీ ప్రాంతం, మల్లంపేట్, జగిత్యాల పలు చోట్ల చిత్రీకరించడం జరిగిందని నిర్మాతలు మల్లిఖార్జున్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ పల్లెటూరు బ్యాక్ డ్రాప్‌లో నిర్మించిన కలివి వనం చిత్రం భారీ విజయం సాధించాలన్నారు. నిర్మాతలకు మరిన్ని మంచి అవకాశాలు కల్పించేలా దేవుడి ఆశీర్వచనాలు ఉండాలన్నారు. తెలంగాణ నేపథ్యంలో వచ్చిన సినిమాలకు మంచి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ చిత్రంలో నటీనటులుగా రఘుబాబు, సమ్మెట గాంధీ, విజయలక్ష్మి, అశోక్, సతీష్, బిత్తిరి సత్తి, బలగం సత్యనారాయణ, మహేంద్రనాథ్, శ్రీచరణ్, అశోక్, హీరోయిన్‌గా నాగదుర్గా నటిస్తున్నారని నిర్మాత మల్లిఖార్జున్ చెప్పారు. కార్యక్రమంలో నిర్మాతలు షాబాద్ మండల మాజీ జెడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.


చౌడమ్మగుట్ట హనుమాన్ ఆలయంలో గోపూజ చేస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గో పూజ

షాద్‌నగర్ అర్బన్, మే 27 (ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ మున్సిపాలిటీలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. ఆలయ పూజారులు రఘుపతిరావు, రాఘవేంద్రచారిలు భక్తులచే గోపూజ చేయించిన అనంతరం హోమాన్ని నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. అలాగే అక్కడే ఉన్న శ్రీకృష్ణ గోశాలకు బాలానగర్ మండలంలోని మోతిఘణాపూర్ గ్రామ శివారులోని నవదుర్గ ఐరన్ పరిశ్రమ మేనేజర్ బోలారాం ట్రాక్టర్ వరిగడ్డిని దానం చేశారు. నానాటికీ తగ్గిపోతున్న దేశీయ పశుసంపదను పరిరక్షించుకోవడానికి ప్రతీఒక్కరు తమ వంతు సహకారం చేయాలని బోలారాం కోరారు.


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్

ఇళ్ల స్థలాల సమస్య త్వరలో పరిష్కారం

కందుకూరు, మే 27(ఆంధ్రజ్యోతి): కందుకూరులో గతంలో నిరుపేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాల పట్టాల ఆధారం త్వరలో వారికి పొజిషన్ చూపుతామని ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రాజ్ ఆధ్వర్యంలో తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో పేదలతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారితో ఆర్డీవో మాట్లాడుతూ.. కందుకూరులోని సర్వే నంబర్లు 788, 107లలో గతంలో ఇళ్ల స్థలాలకు పట్టాలిచ్చారని గుర్తుచేశారు. కానీ ఆ భూమిలో గుట్టలు, రాళ్లు ఉండడంతో పొజిషన్ చూపలేదన్నారు. నాలుగు నెలల క్రితం ఈ భూమి సర్వే చేయించినట్లు తెలిపారు. స్థలాన్ని చదును కోసం కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు చెప్పారు. నిధులు మంజూరు కాగానే రాళ్లను తొలగిస్తామన్నారు. నాయకుడు బాల్‌రాజ్ మాట్లాడుతూ.. ఇళ్ల పట్టాలిచ్చిన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, వారు ఇల్లు కట్టుకోకుంటే రద్దవుతాయని ఆర్డీవో దృష్టికి తెచ్చారు. వెంటనే పొజిషన్ చూపితే పునాదులు తీసుకుంటారని కోరారు. కార్యక్రమంలో మహిళలు ఇందిరమ్మ, శంకరమ్మ, బాలమణి, రామలక్ష్మి, కవిత, యాదమ్మ, లక్ష్మమ్మ, ఆండాలు, మహేందర్, రజియాబేగం, జంగమ్మ, సువర్ణ, చెంచల, పి.అరుణ, వి.జ్యోతి పాల్గొన్నారు.


దాతర్ చెరువు కాలువను పరిశీలిస్తున్న ఏఈ హరిత

కాలువ కబ్జాకు రియల్ వ్యాపారి యత్నం

» పరిశీలించిన అధికారులు

ఆదిభట్ల, మే 27(ఆంధ్రజ్యోతి): కాలువను కబ్జా చేసినట్లు పరిశీలనలో తేలితే చట్టపరమైన చర్యలు తప్పవని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఆదిభట్ల మున్సిపల్ కొంగరకలాన్ పరిధిలోని దాతర్ చెరువు కాలువను ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి దాదాపు 500 మీటర్ల మేర కబ్జా చేసి, పాత కాలువను పూడ్చి రాత్రి రాత్రికే కొత్త కాలువను నిర్మిస్తున్నాడు. కాలువ కబ్జాతో పాటు పక్కన ఉన్న సమాధులను కూల్చివేశాడు. దాంతో కొంగరకలాన్‌కు చెందిన బుడగ జంగాల ప్రజలు, నీళ్ల హరిబాబు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు మంగళవారం ఇరిగేషన్ అధికారులు కాలువను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏఈ హరిత తెలిపిన వివరాల ప్రకారం.. దాతర్ చెరువు అలుగును కూల్చి, కాలువలో మట్టి పోసి ఆక్రమించారని తమ దృష్టికి వచ్చినట్లు చెప్పారు. అలుగు కొంత మేర ఆక్రమించినట్లు తెలుస్తోందని, పాత కాలువ హద్దులు చెరిపి కొత్త కాలువ నిర్మిస్తున్నారని, దాతర్ చెరువు కట్టను కూడా కూల్చారని, కబ్జాపై రెవెన్యూ అధికారులకు లేఖ రాశామని తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో పూర్తిస్థాయిలో సర్వే చేస్తే ఎంత మేరకు కాలువ కబ్జాకు గురైందో తెలుస్తుందన్నారు. కాలువను కబ్జా చేసినట్లు తేలితే సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ఏఈతో పాటు ఇరిగేషన్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సాయి తదితరులు ఉన్నారు.


కరపత్రాలు విడుదల చేస్తున్న అంజయ్య, దేవేందర్

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

షాబాద్, మే 27(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక శాఖ మండలాధ్యక్షుడు బేగరి అంజయ్య అన్నారు. ఈమేరకు ఈనెల 30న కలెక్టరేట్ వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. మంగళవారం షాబాద్‌లో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్‌తో కలిసి ఆయన విడుదల చేశారు. వారు మాట్లాడుతూ కూలీల వేతన బకాయిలు విడుదల చేయాలని, పట్టణ పేదలకు ఉపాధి హామీ పని కల్పించాలని, కూలి రూ.600 చెల్లించాలని కోరుతూ కలెక్టరేట్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. సీఐటీయూ మండల కన్వీనర్ నరసింహ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నర్సింహ, సుధాకర్, వర్దన్, కార్తీక్, శంకర్, కార్తీక్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి


వినతిపత్రం ఇస్తున్న టీఎస్ఎస్‌వో నాయకులు

ఆమనగల్లు, మే 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టూడెంట్ ఆర్గనైజేషన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం టీఎస్ఎస్‌వో రాష్ట్ర సోషల్ మీడియా ఇన్‌చార్జి మీసాల బాలవర్షిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంఈవో పాండుకు వినతి పత్రం అందజేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు ప్రత్యేక చట్టం రూపొందించి అమలు చేయాలని నాయకులు కోరారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలను సీజ్ చేయాలన్నారు. నాయకులు శివ, సాయి, శివనందు, అభి, శివ తదితరులు ఉన్నారు.

నడిరోడ్డులో గుంత.. ప్రయాణికుల చింత



చౌదరిగూడ, మే 27(ఆంధ్రజ్యోతి): జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో మిషన్ భగీరథ పైపులైన్ సరిచేసేందుకు తీసిన గోతిని పూడ్చకపోవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇరుకుగా ఉండే రోడ్డులో ఇలా గుంత తీసి వదిలేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వారాంతపు సంతకు చౌదరిగూడకు ప్రయాణికులు ఎక్కువ మొత్తంలో వస్తుంటారు. ఇటీవలే సీసీ రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు కాంట్రాక్టర్ గుంతను మరింత పెద్దగా తవ్వారు. కాగా, కేవలం అక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు.

కోతుల సమస్యను పరిష్కరించండి


వినతిపత్రం కాపీని చూపుతున్న ఎదులాబాద్ వాసులు

ఘట్‌కేసర్, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎదులాబాద్‌లో కోతుల బెడద తీవ్రంగా మారి ప్రజలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొని జీవిస్తున్నామని స్థానికులు వాపోతున్నారు. తక్షణమే మున్సిపల్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని మంగళవారం ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ఎదులాబాద్ వాసులు కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం, కుమారస్వామి, శ్రావణ్, రాజేష్ పాల్గొన్నారు.

నిలిచిన ధాన్యం కొనుగోళ్లు


లక్ష్మాపూర్‌లో నిలిచిపోయిన ధాన్యం కొనుగోలు

మూడుచింతలపల్లి, మే 27 (ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లిలో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయి. దీంతో గత శనివారం సాయంత్రం నుంచి కేంద్రం నిర్వాహకులు తూకం వేయకపోవడంతో రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. ఏటా 41కిలోలు మాత్రమే మిల్లులకు తరలిస్తున్నామని, కొత్తగా ఈ యేడాది మాత్రం 42కిలోల ధాన్యం తూకం వేయాలని మిల్లర్లు చెప్పుతున్నారని కేంద్రం నిర్వాహకులు అనడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు సత్యనారాయణ, రమేష్, ఆంజనేయులు, యాదగిరి, నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంగా మండల పరిషత్ భవనం


పురపాలక సంఘంగా మారిన మండల పరిషత్ భవనం

ఘట్‌కేసర్ రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ పురపాలక సంఘం కార్యాలయంగా ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయం నేటి బుధవారం నుంచి సేవలు అందించనుంది. మండలంలోని గ్రామాలన్నీ పురపాలక సంఘంలో విలీనమైనందున మండల పరిషత్ ఉద్యోగులను వివిధ శాఖలకు బదిలీచేశారు. దీంతో మండల పరిషత్ భవనం ఖాళీగా ఉండటంతో మున్సిపల్ శాఖ స్వాధీనం చేసుకుంది. ప్రస్తుత మున్సి పల్ కార్యాలయం పట్టణ నడిబొడ్డున ఉన్నందున మున్సిపల్ పరిధిలోని గ్రామాల ప్రజలకు అసౌకర్యంగా ఏర్పడింది. దీంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణలోకి తీసుకున్న ఘట్‌కేసర్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ భాస్కర్‌రెడ్డి మండల పరిషత్ కార్యాలయాన్ని మున్సిపల్ కార్యాలయంగా మార్చారు. దీంతో నేటి బుధవారం నుంచి ప్రజలకు ఈ మున్సిపల్ కార్యాలయం నుండే సేవలు అందించనున్నట్లు ఆయన తెలిపారు.

అ'పూర్వ' సమ్మేళనం


సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

కీసర, మే 27 (ఆంధ్రజ్యోతి): కీసర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2001 సంవత్సరం పదో తరగతి అభ్యసించిన విద్యార్థులంతా ఒకే చోట చేరారు. 25 వసంతాల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని మంగళవారం కీసర పడిగేశిల ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులంతా వారి గత స్మృతులను గుర్తుచేసుకుంటూ ఆటపాటలతో సందడిగా గడిపారు.

మాజీ సర్పంచ్‌ల అరెస్టు

కులకచర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లుల విడుదల కోసం మంగళవారం సీఎం ఇంటి ముట్టడికి తాజా, మాజీ సర్పంచ్‌ల సంఘం జేఏసీ పిలుపునిచ్చింది. ముందస్తుగా కులకచర్ల పోలీసులు పలు గ్రామాల తాజా, మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేశారు. చాపలగూడెం మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, బిందెమ్ గడ్డ తండా మాజీ సర్పంచ్ తుల్జానాయక్‌లు పీఎస్ దగ్గర మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు విడుదల చేశామని చెబుతున్న ప్రభుత్వం ఏ ఖాతాలో జమ చేశారో తెలపాలని డిమాండ్ చేశారు. పనులు చేసి బిల్లులు అడిగితే అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు.

దోమ: తాజా, మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు అందించాలని సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. బిల్లుల కోసం మంగళవారం మాజీ సర్పంచ్‌లు సీఎం ఇంటి ముట్టడికి పిలుపునివ్వడంతో పోలీసులు ముందస్తుగా మండలంలోని మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.


రాజిరెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

రమాబాయి త్యాగం మరువలేనిది


రమాబాయి వర్ధంతిలో కమిటీ సభ్యులు

కొడంగల్, మే 27 (ఆంధ్రజ్యోతి): మాతా రమాబాయి త్యాగం మరువలేనిదని అంబేడ్కర్ ప్రజా సంఘాల నియోజక వర్గ అధ్యక్షుడు రమేశ్‌బాబు అన్నారు. కొడంగల్‌లో రమాబాయి కమిటీ అధ్యక్షురాలు మల్లమ్మ ఆధ్వర్యంలో మంగళవారంరమాబాయి వర్ధంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వెంకటమ్మ, సరస్వతి, పద్మమ్మ, రాములమ్మ, అంజమ్మ, కృష్ణవేణి, భారతి, శిరీష, సావిత్రి, మణెమ్మ పాల్గొన్నారు.

నవాబుపేట: మండల కేంద్రంలో మంగళవారం మాతా రమాబాయి వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ సంఘం మండల అధ్యక్షుడు ఆనందం, దళితరత్న అవార్డు గ్రహీత శివ రాజ్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతికుమార్, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, బీఆర్ఎస్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సంతోష్ తదితరులు మాతా రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సాగుకు సన్నద్ధం

(ఐదో పేజీ తరువాయి)

పెసర గతేడాది 12,839 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది 14,838 ఎకరాల్లో సాగు కావచ్చని భావిస్తున్నారు. ఇతర పంటలు 17,276 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉంది.

ముందస్తుగా విత్తనాలు

వానాకాలం సీజన్‌కు సంబంధించి అవసరమైన విత్తనాలు, ఎరువులను అధికారులు రైతులకు అందుబాటులో ఉంచేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. వికారాబాద్ జిల్లాలో అన్ని రకాల పంటలకు సంబంధించి విత్తనాలు 42,061 కింటాళ్ల అవసరం అవుతాయని అంచనా చేసింది. ఇందులో పత్తి విత్తనాలు 5,17,126 ప్యాకెట్లు, వరి 32,876 క్వింటాళ్లు, కంది 4,561 క్వింటాళ్లు, మొక్కజొన్న 2168 క్వింటాళ్లు, జొన్న 205 క్వింటాళ్లు, సోయాచిక్కుడు 606 క్వింటాళ్లు, పెసర్లు 1,187 క్వింటాళ్లు, మినుములు 458 క్వింటాళ్లు, వేరుశనగ 300 క్వింటాళ్ల విత్తనాలు అవసరమవుతాయని అంచనా వేశారు. గతేడాది 81 వేల మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగించగా ఈ ఏడాది అన్ని పంటలకు సంబంధించి 83,090 మెట్రిక్ టన్నుల ఎరువులు అసరవమని ప్రభుత్వానికి వ్యవసాయ శాఖ నివేదిక అందించింది. అయితే గతేడాది కంటే 3,090 మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం పెరనుందని అంచనా వేశారు.

మేడ్చల్‌లో సాగు వివరాలిలా..

ఈ వానకాలం సీజన్‌లో వరి 17,251 ఎకరాలు, మొక్కజొన్న 200, కంది, పత్తి, జొన్న పంటలు కలిపి 320 ఎకరాల్లో, ఉద్యాన పంటలు 7,348 ఎకరాల్లో సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. అందుకనుగుణంగా విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అన్నిరకాల పంటలు కలిపి ఐదు వేల క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని అంచనా వేశారు. ఇందులో వరి 4,725 క్వింటాళ్లు, మొక్కజొన్న 250, పత్తి 130 క్వింటాళ్ల విత్తనాలు అవసరం అవుతాయని పేర్కొన్నారు. ఎరువులకు సంబంధించి యూరియా 2,194, డీఏపీ 2,345, కాంప్లెక్స్ 29,327 బస్తాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.



ఎరువులు, విత్తనాలు ఉన్నాయి

వానాకాలం సాగుకు సంబంధించి రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. సాగుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాం. వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

- చంద్రకళ, మేడ్చల్ జిల్లా వ్యవసాయాధికారి

హైవేపై ప్రమాదాలకు చెక్!

(ఐదో పేజీ తరువాయి)

నిర్మించాలని నిర్ణయించింది. కొన్నింటికి టెండర్ ప్రక్రియ పూర్తికాగా పనులు ప్రారంభించాల్సి ఉంది.

ఒక బ్రిడ్జి, మూడు వీయూపీలు

ఘట్‌కేసర్ మండలంలోని అన్నోజిగూడ నుంచి అవుషాపూర్ చౌరస్తా వరకు హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రజాప్రతినిదుల లేఖలతో జాతీయ రహదారుల శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఘట్‌కేసర్‌లోని బైపాస్ చౌరస్తాలో బ్రిడ్జి నిర్మాణానికి ఆమోద ముద్ర వేశారు. ఘట్‌కేసర్‌లోని ఈద్గా సమీపంలో మైసమ్మ గుట్ట కాలనీకి వెళ్లే రోడ్డు వద్ద, ఎన్టీపీసీ చౌరస్తా వద్ద, అవుషాపూర్ చౌరస్తా వద్ద వీయూపీ(వెహికిల్ అండర్ పాస్)ల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు. వీటి నిర్మాణాలకు టెండర్ ప్రక్రియను పూర్తి చేయగా రూ.102 కోట్లను మంజూరు చేశారు. వంతెనతోపాటు వీయూపీల నిర్మాణానికి భూపరీక్షలు సైతం పూర్తి చేశారు. అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తా వద్ద అండర్ పాస్ నిర్మాణానికి నిధులు మంజూరైనా


టెండర్ ప్రక్రియ పూర్తి కాలేదు.

ఆరు లైన్లతో బ్రిడ్జి

నిత్యం రద్దీగా ఉండే ఘట్‌కేసర్‌లోని బైపాస్ చౌరస్తాలో ఆరు లేన్లతో బ్రిడ్జి నిర్మాణం జరుగనుంది. జాతీయ రహదారి పైనుంచి వెళ్తుంది. వరంగల్, హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వాహదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఈ బ్రిడ్జి ఉపయోగపడనుంది. ఏడాదిలోగా ఈ పనులన్ని పూర్తై వాహనదారులకు వినియోగంలోకి వచ్చేల చర్యలు చేపట్టారు. అలాగే నారపల్లిలోని దివ్యానగర్ చౌరస్తా, కొర్రెముల చౌరస్తా, జోడిమెట్ల చౌరస్తాల వద్ద వీయూపీల నిర్మాణాల కోసం ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ మూడు చౌరస్తాల్లో వీయూపీలు నిర్మించాలని పలువురు ప్రజాప్రతినిధులకు పత్రాలు అందజేశారు. ఇక్కడ రద్దీని తగ్గించేందుకు గతంలో చౌరస్తాలను మూసి కొంతదూరంలో యూటర్న్‌లు ఏర్పాటు చేయడంతో వాహనదారులు అంతదూరం వెళ్లి యూటర్న్ చేయకుండా రాంగ్‌రూట్లో రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురవుతున్నారు.

వెంటనే పనులు ప్రారంభించాలి



అన్నోజిగూడలోని ఎన్టీపీసీ చౌరస్తావద్ద వీయూపీ నిర్మించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని, ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశాం. ఇప్పటికైనా జాతీయ రహదారుల శాఖ అధికారులు స్పందించడం సంతోషకరం. వెంటనే పనులు ప్రారంభించాలి.

- బోయపల్లి కొండల్‌రెడ్డి, పోచారం మున్సిపల్ మాజీ చైర్మన్

యూరియా వాడకాన్ని తగ్గించాలి


పంటల సాగుపై రైతులకు వివరిస్తున్న శాస్త్రవేత్తలు

శామీర్‌పేట, మే 27 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటపొలాల్లో అధిక యూరియా ఎరువుల వాడకాన్ని తగ్గించి పచ్చిరొట్ట ఎరువులైన జనుము, జీలుగ వాడాలని వ్యవసాయశాస్త్రజ్ఞులు రైతులకు సూచించారు. మండలంలోని లాల్‌గడి మలక్‌పేట, మందాయిపల్లి గ్రామాల్లో మంగళవారం మండల వ్యవసాయాధికారి రమేశ్ ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో వ్యవసాయ శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ లావణ్య, డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ పంటపొలాల్లో అధిక యూరియా తగ్గించి నాణ్యమైన విత్తనాలను వేసుకోవాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువులను వాడి భూమి సారాన్ని పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏఈఓలు రవికుమార్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

కీసర: రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని మండల వ్యవసాయ అధికారిని మాధవీలత అన్నారు. ఈమేరకు మంగళవారం నాగారం మున్సిపల్ పరిధి గోధుమకుంటలో రైతు ముగ్గింట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించి కార్యక్రమ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు

దౌల్తాబాద్: రైతులకు సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి లావణ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని కోఆపరేటివ్ బ్యాంకులో బుధవారం క్వింటాలు ధర రూ.14250 ఉండగా సబ్సిడీ పోనూ రూ.7125కు అందించనున్నట్లు తెలిపారు. రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ జిరాక్స్‌లతో మండల వ్యవసాయ అధికారి దగ్గర పర్మిట్ జనరేట్ చేసుకోవాలని తెలిపారు.

కొడంగల్ రూరల్: సబ్సిడీపై జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి తులసి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కొడంగల్ పట్టణంలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు 50శాతం సబ్సిడీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబాలకు చీఫ్‌విప్ పరామర్శ

బషీరాబాద్, మే 27 (ఆంధ్రజ్యోతి): నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయ కమిటీ ప్రధాన కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేసిన ఆచారి నర్సింహులు మృతి బాధాకరమని ప్రభుత్వ చీఫ్‌విప్ పి.మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని నీళ్లపల్లికి చెందిన ఆచారి నర్సింహులు(76) అనారోగ్యంతో చికిత్సపొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్‌విప్ పి.మహేందర్‌రెడ్డి గ్రామానికి చేరుకొని ఆచారి మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట పురుషోత్తంరావు, ఎ.వెంకట్‌రాంరెడ్డి, ఎస్.వెంకటేష్, పి.జైపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

యాలాల: కిష్టాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ పెండ్యాల రామయ్య మంగళవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి గ్రామానికి చేరుకుని మృతుడికి నివాళులర్పించారు. ఆయన వెంట పురుషోత్తంరావు, సిద్రాల శ్రీనివాస్, అంజిలప్ప, వెంకటయ్య, పల్లె శ్రీనివాస్, పెంటప్ప, బసప్ప ఉన్నారు.

తాండూరు రూరల్: కోటబాస్పల్లిలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ మాజీ చైర్మన్ సాయిరెడ్డి సతీమణి సిరిగిరిపేట్ నర్సమ్మ(75) అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి మంగళవారం గ్రామానికి వెళ్లి మృతురాలికి నివాళులర్పించారు. అనంతరం సాయిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అదేవిధంగా తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి తండ్రి విఠల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీలు మాధవరెడ్డి, గౌడి మంజుల, సిటీ కేబుల్ ఎండీ నర్సింహారెడ్డి(బాబు), నాయకులు తదితరులు పరామర్శించారు. అనంతరం కోటబాస్పల్లిలో జరిగిన అంత్యక్రియలకు హాజరయ్యారు.


యాలాల: నివాళులర్పిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

దుద్యాల, మే 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వారం రోజులుగా కొనసాగిన డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. పోటీల్లో విజేతగా 11 స్ట్రైకర్స్, రన్నరప్‌గా 11 స్టార్స్ జట్లు నిలిచాయి. విజేతకు రూ.7వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు వెంకటయ్య చేతుల మీదుగా అందించారు. అంపైర్లుగా విష్ణువర్ధన్, నర్సింహులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నరేందర్, సంతోష్, నరేశ్, శ్రీకాంత్, అనిల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


ట్రోఫీ అందజేస్తున్న వెంకటయ్య

సంక్షిప్తంగా..

మట్టి రోడ్డు పనులు ప్రారంభం

కులకచర్ల: మండలంలోని తుపాకుల తండా పరిధిలో పొలాలకు వెళ్లేందుకు ఉపాధిహామీ పథకంలో మంగళవారం మట్టి రోడ్డు పనులను ప్రారంభించారు. కూలీలకు ఉపాధితో పాటు రైతుల పొలాలకు వెళ్లేందుకు సౌకర్యం కలుగుతుందని ఉపాధిహామీ ఈసీ చంద్రశేఖర్ తెలిపారు. రూ.12లక్షలతో పనులు జరుగుతున్నట్లు తెలిపారు.

సాయిబాబాకు ప్రత్యేకపూజలు

తాండూరు: స్థానిక కోకట్‌రోడ్డులో ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆలయ కమిటీసభ్యుల ఆధ్వర్యంలో సాయిబాబా మూలవిరాట్‌కు భక్తులతో పాలాభిషేకం చేశారు.

నేడు కొడంగల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్ రూరల్: కొడంగల్ పట్టణంలోని అక్షర హైస్కూల్‌లో శ్రీ సత్యసాయి భజన మండలి, శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

మహిళా సంఘం సభ్యులకు అవగాహన

బొంరాస్‌పేట్: మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం మహిళా సంఘం సభ్యులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీయం సాయన్న సంఘాల పనితీరు, పుస్తకాల నిర్వాహణ, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఆలయం వద్ద అన్నదానం

శామీర్‌పేట: మండల కేంద్రంలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అల్వాల్ ప్రాంతానికి చెందిన మంచాల రవీందర్, రమాదేవి దంపతులు వారి కుటుంబసభ్యులు మంగళవారం నిర్వహకులు అన్నదానం చేపట్టారు. ఆ ఆలయంలో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మందులతో టీబీ తగ్గుముఖం

కులకచర్ల, మే 27 (ఆంధ్రజ్యోతి): మందులతో టీబీ వ్యాధి తగ్గుతుందని జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ రవీందర్‌యాదవ్ అన్నారు. టీబీ ముక్త అభియాన్ కార్యక్రమలో భాగంగా మంగళవారం మండలంలోని చాపాలగూడెం గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మందికి టీబీ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి కిరణ్‌కుమార్‌గౌడ్, సూపర్‌వైజర్ యాదమ్మ, సిబ్బంది నవీన్‌గౌడ్, గోపాల్‌నాయక్, రాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీబీ జిల్లా అధికారి

దౌల్తాబాద్: మందులతో టీబీ వ్యాధి నయం అవుతుందని టీబీ జిల్లా అధికారి రవీందర్‌యాదవ్ అన్నారు. టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మాటూర్‌లో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 63 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బుధవారం కొడంగల్‌లో వీరికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించన్నట్లు తెలిపారు. వైద్యాధికారి అమూల్య ప్రియదర్శిని, సిబ్బంది పాల్గొన్నారు.

గొట్లపల్లి ఆదర్శ పాఠశాలలో అడ్మిషన్లు షురూ

పెద్దేముల్, మే 27(ఆంధ్రజ్యోతి): గొట్లపల్లి సమీపంలోని తెలంగాణ ఆదర్శపాఠశాల, జూనియర్ కళాశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి గాను అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని ప్రిన్సిపల్ గాయత్రి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో మిగిలిపోయిన సీట్లకు ఆసక్తి కలిగిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులు ఆఫ్‌లైన్‌లోనే అందించవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులు జూన్ 5వ తేదీ వరకు మాత్రమే స్వీకరించబడతాయని సూచించారు. ఇక్కడ ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా ఎప్‌సెట్, నీట్, జేఈఈ వంటి కోర్సులతో పాటు సీఏ ఫౌండేషన్‌లో కూడా శిక్షణ ఇస్తామని తెలిపారు.

క్రైం కార్నర్

ఫోర్జరీ సంతకాలతో డాక్యుమెంట్ సృష్టించిన ముగ్గురిపై కేసు

ఘట్‌కేసర్ రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): ఫోర్జరీ సంతకాలతో ప్లాటు కాజేసిన వ్యక్తితో పాటు అతడికి సహకరించిన ముగ్గురు వ్యక్తులపై పోచారం ఐటీ కారిడార్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ రాజువర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్, సీతాఫల్ మండికి చెందిన సీహెచ్ రమణరావు 1987లో కొర్రెములలోని సర్వేనెంబర్ 746లోని 200గజాల ప్లాట్ డాక్యుమెంట్ నెంబర్ 76/1987లో జీపీఏ హోల్డర్ సుందర్‌మూర్తి, ప్రభాకర్‌రెడ్డిల వద్ద కొనుగోలు చేసి అప్పటి నుంచి కబ్జాలో ఉన్నట్లు తెలిపారు. కాగా తనకు 1989లో డబ్బులు అవసరం ఉండటంతో డాక్యుమెంట్లు పత్రాలు ఎస్.కోటేశ్వర్‌రావు వద్ద ప్లాట్‌కు సంబంధించిన దస్తావేజులు కుదువపెట్టి డబ్బులు తీసుకున్నాడు. వృత్తిరీత్యా రమణరావు వేరే ప్రాంతానికి వెళ్లడాన్ని అదనుగా భావించిన కోటేశ్వర్‌రావు 2022 ఏప్రిల్ 24న తన సంతకాన్ని ఫోర్జరీ చేసి కోటేశ్వర్‌రావు తన కూతురు అమలకు గిఫ్టుడీడ్ చేశాడు. విషయం తెలుసుకున్న రమణామూర్తి సీసీపత్రాల ఆధారంగా కోటేశ్వర్‌రావు తన కూతురు అమలకు గిఫ్టుడీడ్ చేయగా సాక్షులుగా శ్రీనివాస్‌రావు, శేఖర్‌లు సంతకాలు చేశారు. మంగళవారం సాయంత్రం రమణామూర్తి పోచారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్లాటు డాక్యుమెంట్ సంతకాలు ఫోర్జరీ చేసి, సాక్షులు సంతకాలు చేసిన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపాడు.

పేకాట స్థావరంపై దాడి

మూడుచింతలపల్లి, మే 25 (ఆంధ్రజ్యోతి): శామీర్‌పేట్ పరిధిలోని సెలెబ్రిటీ రీసార్ట్‌లోని ఓ విల్లాలో కొందరు పేకాడుతున్నారన్న పక్కా సమాచారంతో పోలీసులు సామవారం అర్ధరాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వివిధ పార్టీలకు చెందిన నేతలు, రియల్టర్లు సుమారు 14మందిని పట్టుకుని రూ.5లక్షల 70వేల నగదు, నాలుగు కార్లు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

తాండూరు రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి అన్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వీర్‌శెట్టిపల్లి వాగు నుంచి మంగళవారం ఉదయం ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సిబ్బంది అక్కడికి వెళ్లి పరిశీలిస్తుండగా, గోనూరు గేటు సమీపంలో ఒక ట్రాక్టర్‌లో ఇసుక నింపుకొని తరలిస్తున్నారు. ట్రాక్టర్‌ను ఆపి డ్రైవర్‌ను అనుమతి పత్రాలు కోరగా, ఎలాంటి పత్రాలు చూపించలేదు. దీంతో ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అట్టి ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అదేవిధంగా ట్రాక్టర్ యజమాని పరశురాంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎమ్మెల్యే సహకారంతో పట్టణాభివృద్ధి


వినతిపత్రం అందజేస్తున్న హబీబ్‌లాల, 7వ వార్డు వాసులు

తాండూరు, మే 27 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సహకారంతో తాండూరులో సమస్యలను పరిష్కరిస్తామని పట్టణ అధ్యక్షుడు హబీబ్‌లాల అన్నారు. 7వ వార్డుకు చెందిన మహమ్మద్ ముజీబ్‌ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ మేనేజర్ నరేందర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు


కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు

చౌడాపూర్, మే 27 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి అన్నారు. పార్టీ నాయకులతో కలిసి చౌడాపూర్ మండలంలోని అటవి వెంకటాపూర్‌లో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. దాన్యాన్ని తరలించడంలో జాప్యం తగదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాందాస్ నాయక్, జుబేర్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

వెంటవెంటనే తూకం వేయాలి

రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటవెంటనే తూకం వేసి మిల్లులకు పంపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ అన్నారు. చౌడాపూర్ మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోకటం శివశంకర్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలకు సేవ చేయడం అదృష్టం


ఎంఏ బాసిత్‌ను సన్మానిస్తున్న మండల రైతులు

ఘట్‌కేసర్ రూరల్, మే 27(ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు సేవ చేయడం అదృష్టమని కీసర డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఎదులాబాద్‌లోని రైతు వేదికలో మంగళవారం బదిలీపై వెళ్లిన మండల వ్యవసాయ అధికారి ఎంఏ బాసిత్‌కు మండల రైతులు సన్మానించారు. విధి నిర్వహణనే కర్తవ్యంగా పనిచేసి రైతుల మన్ననలను పొందిన బాసిత్ అభినందనీయుడన్నారు. అనంతరం బాసిత్‌ను రైతులు శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి లావణ్య, ఏఈవో జగదీష్, మంజుల, సింగిల్ విండో డైరెక్టర్ కె.ఉదయ్ కుమార్‌రెడ్డి రైతులు మల్లేష్, బస్వయ్య, రాజిరెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలి

కీసర రూరల్, మే 27 (ఆంధ్రజ్యోతి): విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని బీఎస్పీ మేడ్చల్ నియోజకవర్గ అధ్యక్షుడు బోడ జంగయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఆమె వెంటనే చర్యలు చేపడతానని చెప్పినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మస్కె హన్మంతరావు, తదితరులు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న బోడ జంగయ్య